TG/TEL/25/A3731

# నిజం

దృష్టి తెలుగు న్యూస్



WANTED

రిపోర్టర్లు కావలెను

నిజం – దృష్టి తెలుగు న్యూస్ –

దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సెల్: 9247842354



హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-128 | పేజీలు:-4 | ఆదివారం 19- 04 - 2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM


## హర్మూజ్ తెరిచినందుకు ఇరాన్ కు థాంక్స్ చెప్పిన ట్రంప్... కానీ!

- హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు ఇరాన్ అనుమతి
- అయితే ఇరాన్‌పై నావికా దిగ్బంధం కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం
- లెబనాన్ కాల్పుల విరమణ నేపథ్యంలో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది
- ఇరాన్‌తో ఒప్పందం పూర్తయ్యే వరకు ఆంక్షలు ఉంటాయని తెలిపిన అమెరికా
- ఈ పరిణామంతో ప్రపంచ మార్కెట్లలో తగ్గిన చమురు ధరలు



మధ్యప్రాచ్యంలో నెలకొన్న కాల్పుల విరమణ నేపథ్యంలో హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల రాకపోకలకు తెరిచినప్పటికీ, ఇరాన్‌పై మాత్రం తమ నావికా దిగ్బంధం (బ్లాకేడ్) కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధి వ్యాపారానికి, రాకపోకలకు - మిగతా 2 లో

## మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులకు బ్రేక్

- లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు
- రాజ్యాంగ సవరణ బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు
- బిల్లుకు వ్యతిరేకంగా 230 ఓట్లు
- మూడింట రెండొంతుల మెజార్టీ రాకపోవడంతో వీగిపోయిన బిల్లు



కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి లోక్‌సభలో ఊహించని, భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు శుక్రవారం సభలో వీగిపోయింది. లోక్‌సభ స్థానాలను పెంచడంతో పాటు, చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన ఈ బిల్లు, అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని - మిగతా 2 లో

## లోక్ సభలో మహిళా బిల్లు వీగిపోవడానికి పూర్తి బాధ్యత బీజేపీదే



2 లో..

- డీలిమిటేషన్ అంశాన్ని ముడి పెట్టడంతోనే వీగిపోయిందన్న కేటీఆర్
- బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలు మహిళా రిజర్వేషన్లకు సానుకూలమేనని వెల్లడి
- బీజేపీ రాజకీయంతోనే బిల్లు వీగిపోయిందని విమర్శ
- ఇప్పటికైనా డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు తేవాలని సూచన

లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ పన్నిన కుటిల రాజకీయాల

# మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులు

- ప్రభుత్వానికి మాట రానివ్వద్దని సీఎం ఆదేశాలు
- ఎన్డీఎస్ఏ మార్గదర్శకాల మేరకే చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- మంత్రి ఉత్తమ్‌తో కలిసి అధికారులతో దిల్లీలో సమీక్ష



2లో

గత పాలకుల తప్పుల వల్లే బ్యారేజీలు పనికిరాకుండా పోయాయన్న ముఖ్యమంత్రి కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు ఎన్డీఎస్ఏ?ఏ మార్గదర్శకాలకు అనుగుణంగానే చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దిల్లీలో నీటి పారుదల

## వీగిపోయిన మహిళా రిజర్వేషన్ బిల్లు

**బీజేపీపై కవిత తీవ్ర ఆగ్రహం**



- ప్రతిపక్షాలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తాయని బీజేపీకి తెలుసన్నకవిత
- తమకు సంఖ్యాబలం లేకపోయినా బీజేపీ హడావుడిగా బిల్లును ప్రవేశపెట్టిందని విమర్శ
- బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపు
- మహిళ నాయకత్వం వహిస్తున్న పశ్చిమ బెంగాల్ నుంచి ప్రారంభించాలని పిలుపు

లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించారు. - మిగతా 2 లో

## రాజ్యాంగంపై దాడిని అడ్డుకున్నాం



- కీలక బిల్లు ఓటమిపై రాహుల్ గాంధీ
- లోక్‌సభలో ప్రభుత్వానికి ఎదురుదెబ్బ.. మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు వీగిపోయింది
- బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు.. మెజారిటీకి 60 ఓట్ల దూరంలో ఓటమి
- మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రను అడ్డుకున్నామన్న రాహుల్ గాంధీ
- డెలిమిటేషన్‌తో రిజర్వేషన్లను ముడిపెట్టడాన్ని 'ఇండియా' కూటమి తీవ్రంగా వ్యతిరేకించింది

కేంద్ర ప్రభుత్వానికి లోక్‌సభలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహిళా రిజర్వేషన్ల చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తూ ప్రభుత్వం - మిగతా 2 లో

## మీకు మహిళల ఉసురు తగులుతుంది

**విపక్షాలపై అమిత్ షా ఫైర్**



- లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు తిరస్కరణ
- విపక్షాల వల్లే బిల్లు వీగిపోయిందని అమిత్ షా ఆరోపణ
- కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలపై ఆగ్రహం
- ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు

మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభలో వీగిపోవడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విపక్షాలపై తీవ్రస్థాయిలో - మిగతా 2 లో

## మైక్రో ఫైనాన్స్ కేసులో కింగ్ పిన్ మంగ్లీ..?


- వెలుగులోకి సంచలన విషయాలు.!.
- సింగర్ మంగ్లీ వివాదంలో తవ్వుతున్న కొద్ది కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా..
- పోలీసులు రమావత్ మధును అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.
- ఈ క్రమంలో అనేక విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి.
- సింగర్ మంగ్లీ వివాదం తెలుగు రాష్ట్రాల్లోనే హాట్ టాపిక్ గా మారింది.



ఇప్పటికే దీనిపై లాయర్ సుబ్బు పంజాగుట్ట పీఎస్ లో మంగ్లీ, రమావత్ మధు, మంగ్లీ సోదరుడిపై ఫిర్యాదు చేశారు. దీనిపై కౌంటర్ గా మంగ్లీ సైతం నార్సింగి పీఎస్ లో, పంజాగుట్ట పీఎస్ లో లాయర్ సుబ్బుపై కేసు నమోదు చేసింది. దీనిపై దుమారం రాజుకుంది. ఈ క్రమంలో తాజాగా.. పోలీసులు - మిగతా 2 లో

## ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త...

- హర్మూజ్ ను పూర్తిగా తెరిచామంటూ ప్రకటన
- హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల కోసం తెరిచినట్లు ప్రకటించిన ఇరాన్
- లెబనాన్‌లో కాల్పుల విరమణ కొనసాగినంత కాలం ఈ నిర్ణయం అమలు
- నిర్ణీత మార్గంలోనే నౌకలు ప్రయాణించాలని స్పష్టం చేసిన ఇరాన్
- ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ అధికారిక ప్రకటన



2 లో..

ఇటీవల కాలంలో చమురు, ఎల్పీజీ సంక్షోభంలో అల్లాడిపోతున్న ప్రపంచ దేశాలకు ఇరాన్ తియ్యని కబురు వినిపించింది. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హార్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. హార్మూజ్ ను పూర్తిగా తెరిచినట్లు వెల్లడించింది. లెబనాన్‌లో అమలవుతున్న

## విమర్శల నుంచి విజయ శిఖరం వరకు..

# లోకేష్ రాజకీయ ప్రస్థానం ఇదే..!

- ప్రత్యర్థి పార్టీ నుంచి విమర్శలు..
- ఇబ్బందికర పరిస్థితులను ఎదురొడ్డి..
- పార్టీ అగ్రనేతలను సమన్వయం చేసుకోవడం..



2లో

సానుకూల ఆలోచనా ధోరణితో యువ నేత నారా లోకేశ్ అడుగులేస్తున్నారు. విమర్శకులు సైతం ముక్కున వేలేసుకునే పరిస్థితులు చోటుచేసుకున్నాయి. రాజకీయాల్లో చెలామణి కావాలనే పట్టుదలకు ప్రజా విశ్వాసం తోడైంది. నవతర రాజకీయాల్లో తిరుగులేని నాయకుడిగా నిలబెట్టాయి. తెలుగుదేశం పార్టీలో నెంబర్ టూ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. రాజకీయ కుటుంబంలో పుట్టిన లోకేశ్ రాజకీయాలకు వారసుడిగా మారేందుకు చాలాకాలం పట్టింది. తాత స్థాపించిన పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమితులయ్యారు. తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు నాయుడు అంచెలు అంచెలుగా ఎదిగి.. ఆపార్టీకి అధ్యక్షుడిగా... రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ప్రాతినిధ్యం వహించారు. రాజకీయ పదవులు కోరుకుంటే వచ్చేవికావు.. ప్రజలు ఆశీర్వదించాలి... పార్టీలో కార్యకర్తలు కోరుకోవాలి. ఈ విధానంతో యువ నాయకుడు, చంద్రబాబు కుమారుడు లోకేశ్ ఎదుగుతూ వచ్చారు. కుటుంబానికి తాత ఎన్టీరామారావు, ఆతర్వాత చంద్రబాబునాయుడు.. వేర్వేరు సందర్భాల్లో రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన వారు.. కుటుంబానికి బలమైన

## మహిళా బిల్లును వ్యతిరేకించి ఏం సాధించారు?



మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును వ్యతిరేకించిన పార్టీలపై జగన్ విమర్శలు ఈ పరిణామంతో మహిళలకు, దక్షిణ రాష్ట్రాలకు న్యాయం జరగలేదని వ్యాఖ్య 2026 జనాభా లెక్కలతో డీలిమిటేషన్ చేస్తే దక్షిణాదికి నష్టమని ఆందోళన కుటుంబ నియంత్రణ పాటించినందుకు శిక్ష అనుభవించాల్సి వస్తోందని పోస్ట్ మహిళా రిజర్వేషన్ చట్ట - మిగతా 2 లో

## పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు

**మరో స్టాండప్ కమెడియన్ అరెస్ట్**



2 లో..

పవన్ కల్యాణ్‌పై వివాదాస్పద వ్యాఖ్యల కలకలం మరో స్టాండప్ కమెడియన్ రఫీక్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు బెయిల్‌పై విడుదలైన కమెడియన్ అనుదీప్ కటికాల వ్యక్తిగత విమర్శల వెనుక రాజకీయ కుట్ర ఉందన్న అనుమానాలుఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిగత విమర్శలకు దిగిన ఇద్దరు స్టాండప్ కమెడియన్లపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే అనుదీప్ కటికల అనే కమెడియన్‌ను అరెస్ట్ చేయగా, తాజాగా విశాఖపట్నంకు చెందిన మరో కమెడియన్ రఫీక్ మొహమ్మద్‌ను పోలీసులు

## మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ మాయోపాయం పారలేదు: షర్మిల



- వీగిపోయింది డీలిమిటేషన్ బిల్లేనని, మహిళా బిల్లు కాదని వ్యాఖ్య
- విపక్షాలు మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ
- 2023లో ఆమోదం పొందిన బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్
- 543 లోక్‌సభ స్థానాల్లో 33 శాతం కోటా వర్తింపజేయాలని సూచన

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో - మిగతా 2 లో

TG/TEL/25/A3731
నిజం
దృష్టి తెలుగు న్యూస్
ఆదివారం 19- 04 - 2026

# లోక్ సభలో మహిళా బిల్లు వీగిపోవడానికి పూర్తి బాధ్యత బీజేపీదే

**మొదటిపేజీ తరువాయి –** వల్లే దేశంలోని మహిళా లోకానికి దక్కాల్సిన రిజర్వేషన్లు వెంటనే దక్కకుండా పోయాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ సహా దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు పలికినప్పటికీ, బీజేపీ కావాలనే డీలిమిటేషన్ పేరుతో చిక్కుముళ్లు తెచ్చిపెట్టి బిల్లు విఫలమయ్యేలా చేసిందని ఆరోపించారు. మహిళా సాధికారతపై బీజేపీకి ఉన్న చిత్తశుద్ధి నేటి పరిణామాలతో తేలిపోయిందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అనవసరంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంతో ముడిపెట్టడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ సీట్లతోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేసి ఉంటే ఎటువంటి సమస్య వచ్చేది కాదని, కానీ మహిళల రిజర్వేషన్ల అంశాన్ని ముడిపెట్టి దేశ మహిళల భుజాల మీద నుంచి దక్షిణాది రాష్ట్రాల గొంతు కోయాలని బీజేపీ చూసిందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను, డీలిమిటేషన్ పర్యవసానాలను పట్టించుకోకుండా మొండిగా ముందుకు పోవడంతో ఒక చారిత్రక అవకాశం జారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

### బీజేపీ రాజకీయ స్వార్థానికి మహిళలు బలి

మహిళా రిజర్వేషన్ల పేరుతో బీజేపీ ఆడిన నాటకాన్ని దేశ ప్రజలు కళ్లారా చూశారని కేటీఆర్ అన్నారు. కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసం మహిళలను వాడుకుని, ఇప్పుడు వారిని వెన్నుపోటు పొడిచిన పార్టీగా బీజేపీ చరిత్రలో నిలిచిపోతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా బీజేపీ తన నిజాయతీని నిరూపించుకోవాలంటే, డీలిమిటేషన్ నిబంధన లేకుండా కేవలం మహిళా రిజర్వేషన్ల కోసమే ఒక కొత్త బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల నుంచే దాన్ని అమలు చేయాలని అన్నారు. దేశంలోని అనేక పార్టీలు డీలిమిటేషన్ అనే అంశం అత్యంత సంక్లిష్టమైనదని చెప్పాయని తెలిపారు. ప్రస్తుత విధానంలో దక్షిణ భారతదేశానికి పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గడం ప్రమాదకరమని స్పష్టంగా చెప్పిన విషయాన్ని బీజేపీ గుర్తించాలని అన్నారు. ఇప్పటికైనా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని డీలిమిటేషన్ అంశంపై విస్తృతమైన చర్చ, సంప్రదింపులు చేపట్టాలని సూచించారు. డీలిమిటేషన్ అంశంపై మొండిగా ముందుకుపోవడం కుదరదనే విషయం ఈరోజు లోక్ సభలో జరిగిన పరిణామాలను బట్టి బీజేపీ తెలుసుకోవాలని అన్నారు. దీనితో పాటు తెలంగాణ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో అసెంబ్లీ సీట్ల పెంపు అనేది మా రాష్ట్ర హక్కు అని కేటీఆర్ అన్నారు. జమ్ము కశ్మీర్, అసోంలో దేశవ్యాప్త డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా సీట్ల పెంపు చేపట్టిన కేంద్రం, తెలంగాణ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. మహిళా బిల్లుతో, దేశవ్యాప్త డీలిమిటేషన్ అంశం సంబంధం లేకుండా, తెలంగాణ అసెంబ్లీ సీట్లను 2028 లోపు పెంచేలా ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రత్యేక బిల్లు తీసుకురావాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులకు బ్రేక్

**మొదటిపేజీ తరువాయి –** సాధించడంలో విఫలమైంది. రెండు రోజుల పాటు జరిగిన వాడీవేడి చర్చ అనంతరం జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. సాధారణ మెజారిటీ లభించినప్పటికీ, రాజ్యాంగ సవరణకు తప్పనిసరి అయిన ప్రత్యేక మెజారిటీని పొందలేకపోవడంతో బిల్లు ఓటమి పాలైంది. ఈ బిల్లు ద్వారా లోక్‌సభలోని ప్రస్తుత 543 స్థానాలను 850కి పెంచాలని, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేశాక ఈ పెంపును అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనితో పాటే, ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 33 శాతం మహిళా రిజర్వేషన్లను లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. బిల్లుపై జరిగిన చర్చలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా బలంగా తమ వాదనలు వినిపించారు. ఓటర్లు, ప్రజాప్రతినిధుల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమానతను సరిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి అని ప్రభుత్వం పేర్కొంది. మహిళా రిజర్వేషన్ల విషయంలో ప్రతిపక్షాల వైఖరిని దేశంలోని మహిళలందరూ గమనిస్తున్నారని హెచ్చరించారు. నియోజకవర్గాల పునర్విభజనను కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అడ్డుకుంటూ వస్తోందని, ఇప్పుడు కూడా అదే పనిచేస్తోందని అమిత్ షా ఆరోపించారు. అయితే, ప్రభుత్వ వాదనను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. మహిళా సాధికారత అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం రాజకీయ ఎత్తుగడకు పాల్పడుతోందని విమర్శించాయి. ఈ బిల్లు ఆమోదం పొందితే, జనాభా పెరుగుదల ఎక్కువగా ఉన్న ఉత్తర భారత రాష్ట్రాలకు రాజకీయంగా ప్రయోజనం చేకూరుతుందని, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. దక్షిణాది రాష్ట్రాల గొంతును అణచివేసే ప్రయత్నమే ఈ బిల్లు అని విపక్షాలు ఆరోపించాయి. ఈ కీలక బిల్లు ఓటమి పాలవడంతో, దీనితో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మహిళా కోటాను విస్తరించే సవరణ బిల్లులను కూడా ముందుకు తీసుకువెళ్లబోమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఈ ఓటమి మోదీ ప్రభుత్వ శాసనపరమైన రికార్డులో ఒక అరుదైన వైఫల్యంగా నిలిచిపోతుంది. అదే సమయంలో, తమ వాదనకు విజయం లభించిందని ప్రతిపక్షాలు భావిస్తున్నప్పటికీ, చట్టసభల్లో అడుగుపెట్టాలని ఆశిస్తున్న మహిళలకు మాత్రం రిజర్వేషన్ల కోసం నిరీక్షణ మరింత పెరిగింది. ఈ పరిణామంతో మహిళా రిజర్వేషన్ల భవిష్యత్తు మళ్లీ అనిశ్చితిలో పడింది.

# విమర్శల నుంచి విజయ శిఖరం వరకు.. లోకేష్ రాజకీయ ప్రస్థానం ఇదే..!

**మొదటిపేజీ తరువాయి –** రాజకీయ పునాది ఉంది. వారసత్వంతో రాజకీయాల్లోకి రావాలా? వ్యక్తిగత ప్రతిభా సామర్థ్యాలతో ప్రజల్లోకి వెళ్లాలా? అనే ప్రశ్నలు లోకేశ్ ను తర్జనభర్జనకు గురిచేశాయి. అపారమైన అవకాశాలున్నాయి.. కొడుకు నాయకుడిగా ఎదిగేస్తాడని చంద్రబాబు పొరపాటున కూడా భావించలేదు.. కొడుకు లోకేశ్ ఎదుగుదలకు చంద్రబాబు ఎత్తుగడ మంచి ఫలితాన్నిచ్చింది. లోకేశ్ రాజకీయాల్లోకి రావాలనే భావన.. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కల్పించారు. కార్యకర్తల అభ్యర్థనతోనే లోకేశ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టేలా చేశారు. ఆంధ్రప్రదేశ్ మనుగడలో తెలుగుదేశం పార్టీ ఓ సంచలనం. సినీ గ్లామర్ తో తాత ఎన్టీఆర్ స్థాపించిన రాజకీయపార్టీతో ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. జాతీయ రాజకీయాలను తెలుగుదేశం పార్టీ ప్రభావితం చేసే విధంగా ఎదిగింది. ఎన్టీరామారావు వ్యక్తిగత పలుకుబడి... సినీగ్లామర్...రాజకీయాల్లో రాణించిన తీరు...అనుసరించిన విధానాలు ప్రజల్లో ప్రత్యేక ముద్రవేసుకున్నారు. సంవత్సరాలు కాదు...దశాబ్దాలు గడిచినా.. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాల గురించి మాట్లాడాలంటే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ముందు... ఆ తర్వాత... అనే ప్రస్తావన తీసుకొస్తారు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీరామారావు సెన్సేషన్ క్రియేట్ చేశారు. 1984 ఎన్నికల్లో కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యానికి పాతరవేశారు. సరికొత్త రాజకీయాలకు బీజం వేశారు. ఎన్టీరామారావు చరిష్మతో 1994 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించింది. 1994 అసెంబ్లీ ఎన్నికలకు ముందుగా చోటుచేసుకున్న పరిణామాలతో ఎన్టీరామారావు అల్లుడు చంద్రబాబు నాయుడు పార్టీ పగ్గాలను చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చంద్రబాబు చక్రం తిప్పారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ రోజుల్లోనే పుట్టిన లోకేశ్ ను విద్యావంతుడిగా తీర్చిదిద్దే ప్రయత్నంలో చంద్రబాబు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ప్రాథమిక విద్యాభ్యాసం హైదరాబాద్ లోనే సాగింది. విద్యావంతుడిగా... ప్రతిభావంతుడిగా రాణించాలని లోకేశ్ ను అమెరికాలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయంలో చదివించారు. అక్కడే నందమూరి బాలకృష్ణ కుమార్తె బ్రాహ్మణితోపాటు... అమెరికాలోనే ఉండి చదువుకున్నారు. 2000-2004 సంవత్సరాల మధ్య అమెరికాలోని కార్నెగీ మెల్లన్ యూనివర్శిటీలో డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ బిజినెస్ లో మాస్టర్ డిగ్రీ పూర్తిచేశారు. మేనరికమే కాదు... చిన్నప్పటి నుంచి కలిసి మెలిసి ఎదిగిన బ్రాహ్మణి, లోకేశ్ బాబులకు వివాహం జరిపించారు. దీంతో ఎన్టీఆర్ కుటుంబంతో చంద్రబాబు కుటుంబానికి మరింత బంధాన్ని ఏర్పరచింది. చదువు పూర్తయ్యాక వ్యాపార కార్యకలాపాల్లో రాణించాలా? రాజకీయాల్లో రాణించాలా? అనే ప్రశ్నలు చంద్రబాబునాయుడిని ఇబ్బందిపెట్టాయి. అందుకే.. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న మంత్రి నారా లోకేశ్‌కు పదోన్నతి లభించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా,... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు... కొడుకు లోకేశ్ ఎదుగుదలపట్ల ఆనందానుభూతికి లోనయ్యారు. లోకేశ్ పనితీరును మెచ్చుకుంటున్న నాయకులు, ప్రజల ఆదరణ అభిమానానికి చేరువైన లోకేశ్ ప్రస్థానంతో చంద్రబాబు పుత్రోత్సాహంతో అమితానంద భరితులయ్యారు. రాజకీయాల్లో ఎదగాలనుకున్న యువకులు... లోకేశ్ రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని భావిస్తున్నారు. డబ్బుంటేనే అన్నీ సాధ్యం కావు. ప్రజలతో మమేకం కావాలి.... ప్రజల అవసరాలను తీర్చాలి... అంకితభావం, జవాబుదారీతనంతో ఉంటే ప్రజలే పదవులిస్తారని లోకేశ్ నిరూపించారు. కార్యకర్త స్థాయి నుండి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ స్థాయికి ఎదుగుతూ, పార్టీని, నాయకత్వాన్ని బలోపేతం చేయడంలో లోకేష్ కీలక పాత్ర పోషించారు. 2029 లక్ష్యంగా రాబోయే ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించడమే లక్ష్యంగా ఆయన బాధ్యతలు చేపట్టారు. దేశ రాజకీయాల్లో లోకేశ్ బాబు మరింత ఉన్నతంగా రాణించాలని ఆశిద్దాం..

# మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులు

**మొదటిపేజీ తరువాయి –** శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి బ్యారేజీల ప్రస్తుత స్థితిగతులపై అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. బ్యారేజీల పునరుద్ధరణ పనుల కోసం ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీ కన్వీనర్ కల్నల్ పరీక్షిత్ మెహ్రాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. బ్యారేజీల తనిఖీలు, బోరు బావుల తవ్వకాలు, పనుల వేగాన్ని పెంచడానికి తీసుకున్న చర్యల పురోగతి గురించి ఆయన ఆరా తీశారు.

ప్రభుత్వానికి ఎటువంటి మాట రానివ్వకూడదు : ఈ మేరకు మేడిగడ్డ బ్యారేజీ వద్ద బోర్ల తవ్వకాల పనులు ఈ నెల చివరి నాటికి ఊపందుకొంటాయని కల్నల్ పరీక్షిత్ వివరించినట్లు తెలిసింది. పునరుద్ధరణ పనుల వేగాన్ని ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉద్ఘాటిస్తూ తాత్కాలిక చర్యలకు పాల్పడటం లేదా పనులను అసంపూర్ణంగా వదిలేయడం వంటివి చేయకూడదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రభుత్వానికి ఎటువంటి మాట రానివ్వద్దని, ఇబ్బందులకు ఎలాంటి తావు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావాలి : గత ప్రభుత్వం ఇలాంటి నిర్లక్ష్యపూరిత పనులు చేసి అనేక తప్పిదాలు చేయడం వల్లే ఈ బ్యారేజీలు నిరుపయోగంగా ఉండిపోయాయని రేవంత్ పేర్కొన్నారు. ఇటువంటి తప్పులు మళ్లీ జరగకుండా చూసుకోవాలని, బ్యారేజీలను చాలా పకడ్బందీగా పునరుద్ధరించి వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శులు శ్రీధర్, సందీప్?కుమార్? సుల్తానియా, రామగుండం సీఈ శ్రీనివాస్ గుప్తా, మాణిక్ రాజ్, ఇతర ఇంజినీర్లు పాల్గొన్నారు.

మేడిగడ్డకు వెళ్లి పరిశీలించనున్న బీఆర్ ఎస్ పార్టీ నేతలు : ఇదిలా ఉండగా మేడిగడ్డ ఆనకట్ట మరమ్మతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు అక్కడకు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లనున్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన పార్టీ నేతలు కొందరు శనివారం రోజున మేడిగడ్డ ఆనకట్టను పరిశీలించనున్నారు. ఈ నెల 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనకు వెళ్లనున్నారు. ఆనకట్ట మరమ్మతుల ప్రక్రియను పరిశీలించనున్నారు. దాంతో రెండు రోజుల ముందే అక్కడకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు.

పునరుద్ధరణ పనుల కోసం స్టీరింగ్ కమిటీ ఏర్పాటు : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీల పునరుద్ధరణ పనులు వేగం పెంచడానికి ప్రభుత్వం దృష్టి పెట్టింది. రూ.వేల కోట్ల విలువైన సాగునీటి పథకాన్ని అతి త్వరలో వినియోగంలోకి తీసుకొచ్చేలా కసరత్తు చేస్తోంది. దానికి తగ్గట్టుగా బ్యారేజీల పునరుద్ధరణకు పరీక్షిత మెహ్రా నేతృత్వంలో స్టీరింగ్? కమిటీ ఏర్పాట్లు చేసినట్లు ఇటీవల ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు. మేడిగడ్డను కనీసం పాక్షికంగానైనా ఉపయోగంలోకి తేవాలని మంత్రి తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, విజిలెన్స్ కమిషన్ తదితర చట్టబద్ధ సంస్థలు ఇప్పటికే మూడు బ్యారేజీల డిజైన్, ఫౌండేషన్, ప్రణాళిక, అమలు అంశాల్లో ఎన్నో లోపాలను గుర్తించాయని మంత్రి ఉత్తమ్ తెలిపారు. నిర్మాణ సంస్థలు ఈ విషయంలో ఏవైనా సందేహాలుంటే నీటిపారుదలశాఖ కార్యదర్శి శ్రీధర్, కర్నల్ పరీక్షిత్ మెహ్రాతో నిరంతరం 45 రోజులపాటు నిరంతరం పరీక్షలు నిర్వహించేలా బ్యారేజీల ప్రాంతాల్లోనే ఉండాలన్న మంత్రి ఉత్తమ్ వారికి నిర్మాణ సంస్థలు పూర్తి సహకారం అందించాలని నిర్దేశించారు.

# మైక్రో ఫైనాన్స్ కేసులో కింగ్ పిన్ మంగ్లీ..?..

**మొదటిపేజీ తరువాయి –** రమావత్ మధును అరెస్ట్ చేశారు. ముఖ్యంగా గోకులనందన, శుభ క్షేత్ర ప్రాజెక్ట్ పేరుతో వందల కోట్లను మధు గ్యాంగ్ వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. మైక్రో ఫైనాన్స్ వ్యాపారాల వెనుక మంగ్లీ ని చూపించి రమావత్ మధు బిజినెస్ చేసినట్లు చెప్తున్నారు. మంగ్లీ కోకపేట నివాసంలోనే మధు మైక్రో ఫైనాన్స్ కార్యకలాపాలు జరిగినట్లు సమాచారం. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ తో కలిసి బాధితుల దగ్గర కోట్లు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. పబ్బులు, స్కూల్స్, వెంచర్స్ అంటూ అమాయకులకు మధు మాయమాటలు చెప్పాడు. మంగ్లీ సోదరికి కాబోయే భర్త తానే అంటూ మధు ప్రచారం చేసుకున్నాడు. మరోవైపు మంగ్లీ మాత్రం దీన్ని ఖండించి, తన కుటుంబం జోలికి వెళ్లవద్దని స్పష్టం చేసింది. నిందితులు మధు, భరత్, శైలజ లతో కలిసి విల్లాల కన్ స్ట్రక్షన్ను చేపడుతున్నట్లు ప్రచారం చేశారు. రమావత్ మధు పేరు బయటకి రాకుండా బాధితులు హిమ కాంత్ రెడ్డి, న్యాయవాది సుబ్బారావు పైన మంగ్లీ ఫిర్యాదులు చేసింది. వెంచర్లు స్టార్ట్ చేయకుండా బ్రోచర్స్ తో మోసాలకు తెరతీశారు.ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో వందల మంది మైక్రో ఫైనాన్స్ బాధితులు ఉన్నారు. మరోవైపు లాయర్ మాత్రం మంగ్లీ విక్టిమ్ కార్డు ప్లే చేస్తుందని తనపై ఫిర్యాదు చేస్తుందని కానీ బాధితులపై కేసులను ఎందుకు పెట్టడంలేదన్నారు. బంజారా మహిళ అని, మీడియా నుంచి వచ్చానని, తన ఫ్యామిలీ అంటూ ఏడుచుకుంటూ విక్టిమ్ కార్డు ప్లే చేస్తుందని లాయర్ సుబ్బు వ్యాఖ్యలు చేశారు. అయితే.. దీని వెనకాల మంగ్లీ కీ రోల్ ప్లే చేసిందని వార్తలు నెట్టింట ప్రచారం అవుతున్నాయి. దీనిపై మాత్రం పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు.

# ప్రపంచ దేశాలకు ఇరాన్ శుభవార్త...

**మొదటిపేజీ తరువాయి –**



కాల్పుల విరమణ కొనసాగినంత కాలం, ఈ జలసంధి గుండా అన్ని రకాల వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ శుక్రవారం అధికారికంగా వెల్లడించారు. "లెబనాన్‌లో కాల్పుల విరమణ ఒప్పందానికి అనుగుణంగా, ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ పోర్ట్స్ అండ్ మారిటైమ్ ఆర్గనైజేషన్ ఇప్పటికే ప్రకటించిన సమన్వయ మార్గంలో, మిగిలిన కాల్పుల విరమణ కాలానికి హర్మూజ్ జలసంధి గుండా అన్ని వాణిజ్య నౌకల ప్రయాణానికి మార్గం పూర్తిగా తెరిచి ఉంటుంది" అని మంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ చమురు వాణిజ్యంలో హర్మూజ్ జలసంధి అత్యంత వ్యూహాత్మకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తాజా నిర్ణయం వాణిజ్య వర్గాలకు ఊరటనిస్తోంది. అయితే, నౌకలు తమ దేశ మారిటైమ్ సంస్థ నిర్దేశించిన మార్గంలోనే ప్రయాణించాలనే షరతును ఇరాన్ విధించింది. లెబనాన్‌లో శాంతియుత వాతావరణం కొనసాగేలా చూసే చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# వీగిపోయిన మహిళా రిజర్వేషన్ బిల్లు...

**మొదటిపేజీ తరువాయి –** ఈ మేరకు ఆమె ఒక వీడియోను విడుదల చేశారు. బీజేపీ దేశ ప్రజలను మరోసారి మోసం చేసిందని కవిత మండిపడ్డారు. అన్నీ తెలిసే బీజేపీ ఈ బిల్లును ప్రవేశపెట్టిందని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజనను మహిళా రిజర్వేషన్ బిల్లుతో ముడిపెట్టడం వల్ల ప్రతిపక్షాలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తాయని అధికార పార్టీకి ముందే తెలుసని అన్నారు. అయినప్పటికీ ఈ బిల్లులను కలిపి తీసుకువచ్చిందని అన్నారు. తమకు అవసరమైన సంఖ్యాబలం లేదని తెలిసినప్పటికీ ప్రభుత్వం ఈ బిల్లును హడావుడిగా ప్రవేశపెట్టిందని ఆరోపించారు. భారత మహిళల భావోద్వేగాలను బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుందని ధ్వజమెత్తారు. మహిళలందరూ ఈ మోసాన్ని గుర్తించి, బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఒక మహిళ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్నారని, కాబట్టి బీజేపీ పతనాన్ని అక్కడి నుంచి ప్రారంభించాలని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని దీని ద్వారా నిరూపితమైందని అన్నారు. బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆడబిడ్డలు కూడా బీజేపీ చేసిన మోసాన్ని గుర్తించాలని అన్నారు. బెంగాల్‌లోని మీ స్నేహితులు, సన్నిహితులకు మమతా బెనర్జీకి ఓటు వేసి గెలిపించాలని చెప్పాలని కోరారు.

# రాజ్యాంగంపై దాడిని అడ్డుకున్నాం

**మొదటిపేజీ తరువాయి –** ప్రవేశపెట్టిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 వీగిపోయింది. శుక్రవారం సభలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో ఓటమి పాలైంది. విపక్ష 'ఇండియా' కూటమి సభ్యులు ఐక్యంగా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో ఉన్న సభ్యులలో మూడింట రెండొంతుల మంది, అంటే 358 మంది సభ్యుల మద్దతు అవసరం. కానీ, ప్రభుత్వానికి 60 ఓట్లు తక్కువయ్యాయి. మహిళా రిజర్వేషన్ల అమలును భవిష్యత్తులో చేపట్టే డెలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియతో ముడిపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ ఓటమిపై లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, ఇది రాజ్యాంగం సాధించిన విజయమని అభివర్ణించారు. "సవరణ బిల్లు పడిపోయింది. మహిళల పేరుతో రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి వారు రాజ్యాంగ విరుద్ధమైన ఉపాయాన్ని ఉపయోగించారు. భారతదేశం అది గమనించింది. 'ఇండియా' కూటమి దానిని ఆపింది. రాజ్యాంగానికి జై" అని ఆయన పేర్కొన్నారు. ఇది మహిళలకు సంబంధించిన బిల్లు కాదని, డీలిమిటేషన్ పేరుతో దక్షిణ, ఈశాన్య రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్ర అని ఆయన ఆరోపించారు. మరోవైపు, ఓటర్లు, ఎంపీల మధ్య నిష్పత్తిలో ఉన్న అసమతుల్యతను సరిదిద్దడానికే డీలిమిటేషన్ అవసరమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వాదించారు. సవరణ బిల్లు ఓటమితో, దీనికి సంబంధించిన మరో రెండు బిల్లులను కూడా ముందుకు తీసుకెళ్లబోమని ప్రభుత్వం ప్రకటించింది.

# హర్మూజ్ తెరిచినందుకు ఇరాన్ కు థాంక్స్ చెప్పిన ట్రంప్... కానీ!

**మొదటిపేజీ తరువాయి –** సిద్ధంగా ఉందని, అందుకు ఇరాన్ కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని, అయితే ఇరాన్‌తో తమ ఒప్పందం 100 శాతం పూర్తయ్యే వరకు ఆ దేశంపై సైనిక దిగ్బంధం కొనసాగుతుందని ఆయన తెలిపారు. చాలా అంశాలపై ఇప్పటికే చర్చలు జరిగాయని, ఈ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు, లెబనాన్‌లో కాల్పుల విరమణకు అనుగుణంగా హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకల కోసం పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ప్రపంచంలోనే కీలకమైన ఈ జలమార్గం తిరిగి తెరుచుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు ఒక్కసారిగా తగ్గాయి. అయితే, అమెరికా తన సైనిక వైఖరిని మార్చుకోలేదు. ఈ దిగ్బంధంలో భాగంగా 10,000 మందికి పైగా సైనికులు, డజనుకు పైగా యుద్ధ నౌకలు, విమానాలు పాల్గొంటున్నాయని అమెరికా సైనిక అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఇంకా పూర్తిగా చల్లారలేదు. ఒకవైపు దౌత్యపరమైన చర్చలు జరుగుతుండగానే, మరోవైపు ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని కొనసాగించడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది. పర్షియన్ గల్ఫ్‌ను ఒమన్ గల్ఫ్‌తో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైనది.

# మహిళా రిజర్వేషన్ పేరిట బీజేపీ మాయోపాయం పారలేదు: షర్మిల

**మొదటిపేజీ తరువాయి –** బీజేపీ కుతంత్రాలకు పాల్పడిందని, అయితే వారి మాయోపాయం ఫలించలేదని ఆమె వ్యాఖ్యానించారు. ఇది ఎన్డీఏ అధర్మంపై ఇండియా కూటమి సాధించిన ధర్మయుద్ధ విజయమని, ప్రజాస్వామ్యం నిలబడిందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "విఫలమైంది అతి గతి లేని డీలిమిటేషన్ బిల్లే తప్ప, మహిళా రిజర్వేషన్ బిల్లు కాదు. మహిళా బిల్లుకు 2023లోనే ఆమోదం లభించింది. విపక్షాలు ఎన్నడూ మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రను మాత్రమే ప్రతిపక్షాలు తిప్పికొట్టాయి" అని స్పష్టం చేశారు. మహిళల పేరుతో నీచ రాజకీయాలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి, బీజేపీకి ఇది చెంపపెట్టు లాంటిదని ఆమె ఘాటుగా విమర్శించారు. సాధికారత పేరుతో సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయాలనే బీజేపీ కుయుక్తులు చెల్లలేదని అన్నారు. ఇది భారతదేశ ప్రజల విజయమని, బీజేపీ రాజకీయ దురుద్దేశానికి ఇది చరమ గీతమని అభివర్ణించారు. ప్రతిపక్షాలపై బురదజల్లడం మాని, మహిళలపై చిత్తశుద్ధి ఉంటే 2023లో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. దేశంలోని 543 లోక్‌సభ స్థానాల్లో వెంటనే 33 శాతం రిజర్వేషన్లు కల్పించి, తమ నిజాయతీని నిరూపించుకోవాలని బీజేపీకి సవాల్ విసిరారు.

# మహిళా బిల్లును వ్యతిరేకించి ఏం సాధించారు?

**మొదటిపేజీ తరువాయి –** సవరణ బిల్లును పార్లమెంటులో వ్యతిరేకించిన పార్టీలు తాము ఏం సాధించాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తెలిపారు. ఈ బిల్లు ఆమోదం పొందకపోవడం వల్ల మహిళలకు, దక్షిణ భారత రాష్ట్రాలకు ఏకకాలంలో అన్యాయం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2026కు మూడింట రెండొంతుల మెజారిటీ లభించని నేపథ్యంలో జగన్ ఎక్స్ వేదికగా స్పందించారు. 2026 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) చేపడితే దక్షిణ రాష్ట్రాల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అసలు వాళ్లు ఏం సాధించారు? వాస్తవ పరిస్థితి చూస్తే, దక్షిణాది రాష్ట్రాల సంఖ్యాబలం (సీట్లు) తగ్గిపోతుంది, మరోవైపు మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా వాయిదా పడింది. దీనివల్ల దక్షిణాదికి న్యాయం జరగలేదు, మహిళలకూ న్యాయం అందలేదు. ఒకవేళ 2026లో జనాభా లెక్కలు తీస్తే, దక్షిణాది పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుంది. కుటుంబ నియంత్రణ విషయంలో ఎంతో క్రమశిక్షణతో వ్యవహరించినందుకు దక్షిణాది రాష్ట్రాలను మరింతగా శిక్షించినట్లు అవుతుంది. జనాభాను నియంత్రించిన పాపానికి మా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ఎంతవరకు సమంజసం? ఇది దక్షిణాదిపై చూపిస్తున్న వివక్ష కాదా? రాజకీయ పార్టీలు ఈ అన్యాయంపై ఎందుకు మౌనంగా ఉంటున్నాయో అర్థం కావడం లేదు" అని జగన్ ట్వీట్ చేశారు.

# పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు...

**మొదటిపేజీ తరువాయి –** అదుపులోకి తీసుకున్నారు. హాస్యం పేరుతో సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఈ ఘటనలు తీవ్ర చర్చకు దారితీశాయి. గత కొంతకాలంగా పవన్ వైవాహిక జీవితం, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచేలా కొందరు సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్‌తో పాటు రామ్ చరణ్, ఉపాసన, నారా లోకేశ్, నందమూరి బాలకృష్ణలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనుదీప్ కటికలను కాకినాడ పోలీసులు ఉత్తరప్రదేశ్‌లో అరెస్ట్ చేశారు. ఈ ఘటన మరువక ముందే రఫీక్ మొహమ్మద్ అనే కమెడియన్ గతంలో చేసిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. పవన్ ముగ్గురు భార్యల గురించి, ముఖ్యంగా ఆయన భార్య అన్నా లెజినోవా గురించి రఫీక్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆగ్రహానికి కారణమయ్యాయి. ఈ వ్యాఖ్యలు సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని జనసేన నేత సాయన శివనారాయణ మచిలీపట్నంలోని చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం రాత్రి విశాఖపట్నంలోని రఫీక్ నివాసానికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పుడు కేవలం సినీ నటుడు మాత్రమే కాదు, రాష్ట్ర డిప్యూటీ సీఎంగా కీలక హోదాలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే రాజకీయ ప్రత్యర్థుల ప్రోద్బలంతోనే ఈ కమెడియన్లు వరుసగా దాడులకు దిగుతున్నారని కూటమి మద్దతుదారులు ఆరోపిస్తున్నారు.

# మీకు మహిళల ఉసురు తగులుతుంది

**మొదటిపేజీ తరువాయి –** విరుచుకుపడ్డారు. భవిష్యత్ ఎన్నికల్లో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని, వారి ఉసురు మీకు తగులుతుందని హెచ్చరించారు. బిల్లును తిరస్కరించడం మహిళలను అవమానించడమేనని ఆయన మండిపడ్డారు. బిల్లు వీగిపోయిన అనంతరం గెలిచామంటూ నినాదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో ఇది తిరస్కరణకు గురైంది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అయితే, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కావడంతో ఇది వీగిపోయింది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఓటింగ్ సమయంలో సభలోనే ఉన్నారు. ఈ పరిణామంపై అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు మహిళా వ్యతిరేక వైఖరితో బిల్లును అడ్డుకున్నాయని ఆరోపించారు. డీలిమిటేషన్ విషయంలో ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనివల్ల దక్షిణ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని ఆయన స్పష్టం చేశారు.

## మాస శివరాత్రి సందర్భంగా మహదేవునికి రుద్రాభిషేకం



రాజాపేట, **ఏప్రిల్ 18 నిజం న్యూస్:** మండల కేంద్రమైన రాజపేటలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా గురువారం రాత్రి ముక్కంటి పరమశివుడికి విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ ట్రస్టు అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించగా రంగ నర్సింలు లక్ష్మి, ఉప్పల రమేష్ స్వప్న దంపతులు పూజల్లో పాల్గొన్నారు. వల్లకాటి సురేష్ భక్తి గీతాలు ఆలపించగా భజన కార్యక్రమం జరిగింది. శ్రీ స్వామివారికి పంచామృత ఫలరసాభిషేకాలు లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, మంగళహారతి,మంత్రపుష్పం అలంకరణ పూజా కార్యక్రమాలు, మహిళలు భక్తులు అభిషేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు తీర్థ ప్రసాద వితరణ వేద ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించారు.

## జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే సందర్భంగా హెల్మెట్ల పంపిణీ




**ఏప్రిల్ 18 నిజం న్యూస్:** అరైవ్ అలైవ్ ప్రోగ్రామ్‌లో భాగంగా జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే సందర్భంగా ఉప్పల చిలక టోల్‌గేట్ వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న మోటార్ వాహనదారులను ఆపి వారికి ట్రాఫిక్ నియమాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ సమక్షంలో 45 మంది రైడర్స్‌కు హెల్మెట్లు పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి రూరల్ సిఐ ఎంఎల్ ముత్తు లింగయ్య, ఎస్ఐ కే వెంకటేష్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 60 మంది మోటార్ సైకిల్ రైడర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మట్టా రాగమయి చేతుల మీదుగా కోట్ల రూపాయల చెక్కుల పంపిణీ



తల్లాడ మండలం **ఏప్రిల్ 18 నిజం న్యూస్:** తల్లాడ పట్టణంలోని ఎండిఓ కార్యాలయం మీటింగ్ హాల్‌లో శనివారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రటరీ, సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా తల్లాడ మండలానికి చెందిన 81 మంది అనారోగ్య లబ్ధిదారులకు మొత్తం రూ.20,51,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులు అందజేశారు. అదేవిధంగా 48 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద రూ.48,05,568 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ పేద ప్రజలు అనారోగ్యానికి గురైనప్పుడు మెరుగైన వైద్యం పొందేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో సహాయపడుతుందని తెలిపారు. అలాగే తక్కువ కాలంలోనే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద నిధులు మంజూరు చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేకంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, రెవెన్యూ సిబ్బంది, సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కుందారంలో అగ్నిప్రమాదం



జైపూర్, **ఏప్రిల్ 18 నిజం న్యూస్:** జైపూర్ మండలంలోని కుందారం గ్రామంలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన ఓ రైతు తన పత్తి చేనులోని చెత్తను తగులబెడుతుండగా అనుకోకుండా మంటలు ఒక్కసారిగా పక్కనే ఉన్న కోల తిరుపతి అనే రైతు తోటకు వ్యాపించాయి.ఈ ప్రమాదంలో తిరుపతికి చెందిన విలువైన శ్రీగంధం చెట్లు,సాగు నీటి పైపులు పూర్తిగా కాలిపోయాయి.స్థానికుల సమాచారంతో వెంటనే ఫైర్ ఇంజన్ ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది.సకాలంలో అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో మంటలు ఇతర పొలాలకు వ్యాపించకుండా ఆగిపోయాయి.తన నష్టానికి కారణమైన సదరు రైతుపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తిరుపతి తెలిపారు.

## జాగృతి కళాశాల విద్యార్థులను సన్మానించిన

### బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి





వనపర్తి బ్యూరో **ఏప్రిల్ 18 నిజం న్యూస్:** రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు ఉమ్మడిజిల్లా 1వ ర్యాంకును సాధించిన జాగృతివిద్యార్థులను ఘనంగా సన్మానించిన బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి. ఐపిఈ 2026 ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో పట్టణంలోని జాగృతి కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో × బైపిసి లో ఉజ్మా హజారా 438 /440 మార్కులతో 2వ ర్యాంకును, అదే విధంగా ×× బైపిసి లో హెచ్. అనుష్క 994/1000 మార్కులతో ఉమ్మడిజిల్లా మొదటి ర్యాంకును సాధించి మరొకసారి వనపర్తిలో ప్రతిభ చాటారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బిజెపి రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ జాగృతి కళాశాలకు వచ్చి స్టేట్ ర్యాంకర్లను ఘనంగా సన్మానించారు.ఈ సంధర్భంగా అయ్యగారి ప్రభాకర్ మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో కార్పొరేట్ స్థాయి మార్కులతో, స్టేట్ ర్యాంకులను, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఫస్ట్ ర్యాంకులను సాధిస్తూ ఉమ్మడి జిల్లాలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నందుకు జాగృతి కళాశాల విద్యార్థులను అభినందించారు. జేఈఈ మెయిన్ -2026 సెక్షన్-× ఫలితాలలో సిహెచ్.అర్జున్ 91.69 పర్సంటైల్ తో 5 అగ్రగామిగా నిలవడం జరిగింది అని కొనియాడారు. జిల్లాలో ఇంటర్ విద్యలో ఐపిఈ మార్కులతో పాటు జేఈఈ నీట్ , ఎంసెట్ లలో కూడా కార్పొరేట్ కళాశాలలకు దీటుగా జాగృతి కళాశాల నిలవడం ఎంతో సంతోషంగా ఉంది అని జాగృతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్ కుమార్ ని యజమాన్య సభ్యులు భాస్కర్ , శ్యామ్ కుమార్ సత్యనారాయణ ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో లోకనాథ్ రెడ్డి, రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, నక్క మహేష్ యాదవ్ 30 వ వార్డ్ బీజేపీ అభ్యర్థి, గోపినాథ్ ఆచార్య, కొమ్ము శ్రీను, పవన్, పెద్దిరాజు బిజెపి ప్రధాన కార్యదర్శి చెన్నరాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ కళాశాల విద్యార్థుల విజయ దుందు

### విద్యార్థులను సన్మానం చేసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి




వనపర్తి బ్యూరో **ఏప్రిల్ 18 నిజం న్యూస్:** వనపర్తి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ దగ్గర గల విజ్ఞాన్ జూనియర్ కళాశాల ఈ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో బైపిసి మొదటి సంవత్సరం చదువుతున్న భవాని, అములేశ్వరి లకు 436 మార్కులతో రాష్ట్రస్థాయి నాలుగవ ర్యాంకులతో విజయ దుందుభి మోగించారు. అదేవిధంగా ఎంపీసీ రెండవ సంవత్సరంలో భవాని 992 మార్కులతో రాష్ట్రస్థాయి ఐదవ ర్యాంకులు సాధించడమే కాకుండా బైపిసి మొదటి సంవత్సరంలో రాణి 440 5 431, 2 సంవత్సరంలో 470కి కృష్ణకుమార్ 456 జి ప్రియాంక 454, సీసీ మొదటి సంవత్సరంలో 500 మార్కుల గాను అశోక్ కుమార్ 473 బబ్లు నాయక్ 456, సీనియర్ ఎంపీసీ నందు వెయ్యి మార్కుల గాను సి దివ్య 986 ఎస్ఎండి సోయల్ 986, సీనియర్ సిఈసికి 1000 మార్కుల గాను ఆర్ గణేష్ 975 సీనియర్ బైపీసీలో 1000 మార్కుల గాను వాకిటి పావని 975 ఎస్ చందు 975 లను సాధించారు. ర్యాంకులను సాధించిన విద్యార్థిలను మాజీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదే విధంగా కరస్పాండెంట్ రాజేష్, డైరెక్టర్ క్రాంతి, ప్రిన్సిపల్ శిఖామణి లు అభినందించి సత్కరించారు.

## ఎన్.ఎస్.సి మరియు ఎన్.పి.ఎల్ -2026 స్పోర్ట్స్ మీట్

### 32 క్రికెట్ టీమ్స్ కు డ్రా సిస్టమ్ నిర్వహణ

### గ్రూప్ ఏ లో 16 టీమ్స్ , గ్రూప్ బి లో 16 టీమ్స్



**ఏప్రిల్ 18 నిజం న్యూస్:**నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ మరియు నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ప్రీమియర్ లీగ్ నిర్వహణ కోసము 32 క్రికెట్ టీములు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. ఇట్టి టీములకు సంబంధించినటువంటి డ్రా సిస్టం ఏ గ్రూపు మరియు బి గ్రూపులుగా విడదీసి నిర్వహించడం జరిగింది. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పోలీస్ కార్యాలయం లోని గౌరవనీయులు నిజాంబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి సాయి చైతన్య, ఐపీఎస్., గారి ఆధ్వర్యంలో డ్రా సిస్టం రూపంలో నిర్వహించడం జరిగింది .

గ్రూప్ ఏ : నందిపేట్ , విక్కీ ఇ× , శివాజీ చత్రపతి , అహ్మదే పూర్ , స్కేల్పేట్ స్ట్రికెర్స్ , రుద్రూర్ , నవిపేట్ , రూరల్ , గరుడ బ్లాస్టర్స్ , దుబాయ్ పెర్ఫ్యూమ్స్ , సందీప్ , వాల్వై 11 స్టార్స్ , 7వ బెటాలియన్ , మోర్తాడ్ 11 , వర్ని వారియర్స్ , మోహన్ 11

గ్రూప్ బి : ముప్కాల్ , వేల్పూర్ , కమ్మర్పల్లి పిఎస్, నిజామాబాద్ మ్యాన్ పవర్ , టౌన్ 1 పిఎస్ , కొండాపూర్ , రైసింగ్ స్టార్స్ , బి.సి.సి ఇందల్వాయి, కోటగిరి , మినార్ ఇ× , మాక్లూర్ , హ్యాపీనింగ్ ఇ× , బోధన్ , నరేష్ ఇ× , గజానంద్ స్ట్రైకర్స్ , గుండారం ఇ×

ఇట్టి క్రీడలు ఏప్రిల్ 20 నుంచి 28 వరకు ఉమెన్స్ కాలేజ్ గ్రౌండ్ నిజామాబాదు యందు నిర్వహించడం జరుగుతుంది ఈ డ్రా నిర్వహణ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ మరియు చీూజ చైర్మన్ సాయి చైతన్య గారు , ఐజూ బస్వా రెడ్డి , జనరల్ సెక్రెటరీ కవిత రెడ్డి , స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి , జాయింట్ సెక్రెటరీ రజనీకాంత్ , హితనీ , ట్రెజరర్ సంతోష్ మరియు స్పోర్ట్స్ కు సంబందించిన పి.ఈ.టీ లు తదితరులు పాల్గొనడం జరిగింది

## నిజామాబాద్ జిల్లాలో 55 బ్లాక్ స్పాట్లను సందర్శించిన ఎస్ఐలు , సిఐలు , ఏసీపీలు , అదనపు డీసీపీ మరియు పోలీస్ కమిషనర్



**ఏప్రిల్ 18 నిజం న్యూస్:** ఫ్లోరోసెంట్ పెయింటింగ్ మరియు రేడియం స్టిక్కర్ తో కూడినటువంటి పోలీస్ కటౌట్ ల ఏర్పాటు శనివారం నాడు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలోగల 55 బ్లాక్ స్పాట్లను పోలీసులు సమగ్రంగా గుర్తించి పర్యవేక్షించారు. ఎస్సైలు , సీఐలు , ఏసీపీలు , అదనపు డీసీపీ (అడ్మిన్)తో పాటు పోలీస్ కమిషనర్ గారు స్వయంగా ఈ ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఏడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జానకంపేట దర్గా వద్ద గౌరవనీయులు నిజామాబాదు పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్., గారు పర్యవేక్షించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రమాదాలకు ప్రధాన కారణాలైన అధిక వేగం , రోడ్డు వంపులు , స్పష్టమైన సూచిక బోర్డుల లేమి , రాత్రివేళలలో తగిన లైటింగ్ లేకపోవడం వంటి అంశాలను గుర్తించారు. వీటిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. బ్లాక్ స్పాట్లలో తక్షణ చర్యలుగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం , ఫ్లోరోసెంట్ పెయింటింగ్ మరియు రేడియం స్టిక్కర్ తో కూడినటువంటి పోలీస్ కటౌట్ లో ఏర్పాటు , స్పీడ్ బ్రేకర్లు నిర్మించడం , రోడ్డు మార్కింగ్‌లు స్పష్టంగా వేయడం , స్ట్రీట్ లైటింగ్ మెరుగుపరచడం వంటి పనులు చేపట్టాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణను పెంచి , నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనంగా, డ్రైవర్లలో అవగాహన పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని , హెల్మెట్ వినియోగం , సీట్ బెల్ట్ తప్పనిసరి పాటించడం వంటి అంశాలపై కట్టుదిట్టంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రజలు కూడా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణలో పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా సమగ్ర చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఇట్లు
పోలీస్ పి.ఆర్.ఓ
పోలీస్ కార్యాలయం నిజామాబాదు

## "మూగ నోముకు మధుర స్వరం"...

### శ్రవణంతో చిన్నారుల భవిష్యత్తుకు వెలుగులు నింపుతున్న టిటిడి

### శ్రవణంను పరిశీలించిన టిటిడి జేఈవో (వైద్యం మరియు విద్య) డా. ఎ. శరత్



తిరుపతి, **ఏప్రిల్ 18 నిజం న్యూస్:** టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర శ్రవణం సంస్థను టిటిడి జేఈవో (వైద్యం మరియు విద్య) డా. ఎ. శరత్ శనివారం అధికారులతో కలిసి సమగ్రంగా పరిశీలించారు. చిన్నారుల జీవితాల్లో శ్రవణం ద్వారా వస్తున్న మార్పులను ప్రత్యక్షంగా తెలుసుకొని, సేవల మరింత మెరుగుదలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా టిటిడి ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర శ్రవణం, శ్రీ వేంకటేశ్వర బాలమందిరం సంస్థలలో అందిస్తున్న సేవలను విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని జేఈవో సూచించారు. టిటిడి సమాచార కేంద్రాలు, కల్యాణ మండపాలు, ఎస్వీబీసీ ఛానల్, టిటిడి సోషల్ మీడియా, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ మరియు దివ్యాంగుల శాఖలతో సమన్వయం చేసుకుని ప్రచారాన్ని విస్తరించాలని ఆదేశించారు. 2026--2027 విద్యాసంవత్సర ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సెలవులు ముగిసేలోపు పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కోరారు. పిల్లల తల్లులతో మమేకమై మాట్లాడిన జేఈవో, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఆహారం అందుతున్నదా, శిక్షణ నాణ్యత ఎలా ఉందో, పిల్లలలో వచ్చిన పురోగతి, సౌకర్యాలపై సంతృప్తి స్థాయి వంటి అంశాలను తెలుసుకున్నారు. పలు ప్రాంతాల నుండి వచ్చిన తల్లులు శిక్షణపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తూ, "మూగ నోముతో వచ్చాం... నవ్వు నోముతో వెళ్తున్నాం" అని భావోద్వేగంగా తెలిపారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో ఆధునిక వసతులు, డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేయాలని జేఈవో సూచించారు. డే స్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం, శిక్షణ అనంతరం ఆధునిక వినికిడి పరికరాల పంపిణీ, మెరుగైన బోధనాంశాలు, బోధనా పద్ధతులు, స్టేషనరీ, స్టడీ మెటీరియల్, పాఠ్యాంశాలపై డిఈవో శ్రీ టి. వెంకట సునీల్‌కు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్వో శ్రీ డి. ఫణికుమార్ నాయుడు, డిఈవో శ్రీ టి. వెంకట సునీల్, అదనపు ఆరోగ్య అధికారి డా. సునీల్, శ్రవణం ప్రాజెక్ట్ ఏఈవో శ్రీమతి అమ్ములు, ఈఈ శ్రీ మల్లికార్జున ప్రసాద్, ఇతర అధికారులు, శ్రవణం సిబ్బంది పాల్గొన్నారు. టిటిడి ప్రధాన ప్రజా సంబంధాల అధికారిచే విడుదల చేయబడినది

## ముదిరాజ్ కులస్థులపై కులగణనలో కుట్ర

### జాతిని తక్కువ చూపే కుట్ర

### వాకిటి.శ్రీధర్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి

### మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్



వనపర్తి బ్యూరో **ఏప్రిల్ 18 నిజం న్యూస్:** తెలంగాణ ముదిరాజు మహాసభ హైదరాబాద్ వాసవి క్లబ్ లో జరిగింది.ఇట్టి సభలో పాల్గొన్న మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్టములో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి రావాలి అన్నా కీలకపాత్ర పోషించేది ముదిరాజులు అని అటువంటి ముదిరాజ్ కులస్థులను కులగణనలో తక్కువ చూపే భారీ కుట్ర జరుగుతుందని ఆరోపించారు. 2011 కులగణాల ప్రకారం రాష్టములో రెండవ స్థానములో ఉన్న ముదిరాజులు నేడు ఎటువంటి స్థానములో ఉంటారో ఆలోచించాలని అన్నారు.అన్ని రాజకీయ పార్టీలలో దామాషా ప్రకారం మన పదవులు మనం పొందాలి అన్న ఏకైక లక్ష్యంతో అధ్యక్షులు బండ.ప్రకాష్ జిల్లాల పర్యటన చేపట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ముదిరాజులను మోసం చేసిందని బీసీ డీ నుండి ఏ గ్రూపులోకి మారుస్తామని ఎన్నికల మేనిఫెస్టో లో పెట్టి రెండున్నర సంవత్సరాలు అయినా పట్టించుకోవడమే లేదని కెసిఆర్ ప్రవేశపెట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ 20/: కి తగ్గించిందని అన్నారు. బండ. ప్రకాశ్ జిల్లా పర్యటనలకు సహకరించి మన సామాజిక వర్గం కోసం కలసికట్టుగా పోరాడదామని కోరారు.సామాజిక వర్గంలో ఒకరిని సంతృప్తి పరిచి మొత్తం సామాజిక వర్గం సేవలు ఉపయోగించడం వల్ల మనం తక్కువగా కనిపిస్తున్నామని హితవు పలుకుతూ ఐక్యంగా పోరాడి మన హక్కులు సాధించుకోవాలని పిలుపు ఇచ్చారు.సమావేశంలో డిఫ్సిఎస్ చైర్మన్ పుట్ట బాలరాజు, చుక్క శేఖర్, రామన్ పాడు వెంకటస్వామి పాల్గొన్నారు.

## జీతాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికుల నిరసన



రాజపేట **ఏప్రిల్ 18 నిజం న్యూస్:** పెండింగ్ లో ఉన్న తమ జీవితాలు వెంటనే చెల్లించాలని పారిశుధ్య కార్మికులు గ్రామపంచాయతీ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగింది. వివరాల్లోకెళితే మండలంలోని బొందుగుల గ్రామపంచాయతీ కార్మికులకు గత నాలుగు నెలలకు పైగా జీతాలు రావాల్సి ఉందని సెక్రటరీని అడిగితే జీతాలు రాలేదంటూ, ఉన్నప్పుడిస్తానంటూ దాటవేస్తున్నాడన్నారు. గతంలో పై అధికారులకు గుర్తు చేసినప్పటికీ ఫలితం లేదని వాపోయారు.జీతాలు రాక పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి టైం కి శాలరీ ఇచ్చేట్లుగా కృషి చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు.

## శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా 136 మంది రక్తదానం



**ఏప్రిల్ 18 నిజం న్యూస్:** శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ జనస్ఫూర్తి న్యూస్ తుని ఆధ్వర్యంలో మూడవ వార్షికోత్సవ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది..స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో 136 మంది రక్తదాతలు రక్తదానం చేయడం జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ యనమల రాజేష్ గారు, సప్తగిరి హేచరీస్ పెదబాబు గారు, కాకినాడ శ్రీ యువసేన బ్లడ్ బ్యాంక్ సతీష్ , ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ పెంకే దుర్గాప్రసాద్,దువ్వు సూర్య శైలేంద్ర,యాదాల నాగేశ్వరరావు,యాదాల సత్తిబాబు, తలపంటి బుజ్జి,పేయ్యల రాజ , మరియు ఇతరులు పాల్గోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రక్త దాతలు అందరికి ఫౌండేషన్ వ్యవస్థాపకులు చీ= గారు వారందరికీ సత్కరించి , సన్మానం చేసి మెమోంటెం ఇచ్చి గౌరవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

## తుని ఐసిడిఎస్ ప్రాజెక్ట్



తుని కాకినాడ జిల్లా **ఏప్రిల్ 18 నిజం న్యూస్:** తుని మున్సిపాలిటీ అంబేద్కర్ నగర్ సెక్టర్లో మరియు ఉప్పరగూడెం నందు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పాక్కోడ కార్యక్రమంలో మరియు అక్షర తృతీయ కార్యక్రమం బాల్య వివాహాలు నిరోధించాలని విషయం గురించి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాజరైన తల్లులకు తండ్రులకు పిల్లలను స్కీమ్ టైం తగ్గించుట గురించి జంక్ ఫుడ్ తినుట మానిపించుట గురించి జంక్ ఫుడ్ వలన వచ్చే నష్టాలు గురించి గర్భవతులు పోషణ గురించి బొమ్మలు సేకరణ గురించి ఈ కార్యక్రమం జరిగినది కార్యక్రమంలో ఐసిడిఎస్ సిపిడిఓ శ్రీలత గారు ఏ సి డి పి ఓ శ్రీ కల గారు సూపర్వైజర్ కృష్ణకుమారి గారు పాల్గొన్నారు బాల్య వివాహాలు చేయడం వలన జరిగే నష్టాల గురించి ఐసిడిఎస్ అధికారులు ఆయన శ్రీనివాస్ గారు శ్రీని గారు వివరించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏఎన్ఎం ఆశా వర్కర్ మరియు తల్లులు పాల్గొన్నారు


నిజం
దృష్టి తెలుగు న్యూస్
ఆదివారం 19- 04 - 2026

# కార్తిక్ సుబ్బరాజ్ స్టైల్ పాతదైందా? సూర్యకు దెబ్బ తప్పదా?



ఒకప్పుడు సౌత్ ఇండియాలోనే మోస్ట్ ప్రామిసింగ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న కార్తీక్ సుబ్బరాజ్, ఇప్పుడు కెరీర్‌లో గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నారు. 'రెట్రో' సినిమా ఆశించిన స్థాయిలో మెప్పించకపోవడంతో ఆయన తదుపరి అడుగుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోవైపు సోషల్ మీడియాలో హీరో సూర్య చుట్టూ జరుగుతున్న చర్చలు ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. అసలు కార్తీక్ సుబ్బరాజ్ రూట్ మార్చారా? స్టార్ హీరోలు ఆయనకు హ్యాండ్ ఇస్తున్నారా? ఈ ఆసక్తికర వివరాలు ఇప్పుడు చూద్దాం. స్టార్ హీరోల వెనకడుగు - కొత్తవారితో ప్రయోగం?: కార్తీక్ సుబ్బరాజ్ మార్క్ సినిమాలకు ఒకప్పుడు విపరీతమైన క్రేజ్ ఉండేది. కానీ 'రెట్రో' పరాజయం తర్వాత కోలీవుడ్ స్టార్ హీరోలు ఆయనతో పని చేసేందుకు కాస్త వెనకాడుతున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఆయన మేకింగ్ స్టైల్ రొటీన్‌గా మారిందని కొందరు విమర్శిస్తుండటంతో, కార్తీక్ తన రూట్ మార్చినట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం ఆయన యువ నటీనటులతో ఒక చిత్రాన్ని సైలెంట్‌గా పూర్తి చేశారట. స్టార్స్ లేకపోయినా, కథపై నమ్మకంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సూర్య చుట్టూ నెగిటివ్ ట్రోల్స్: ప్రస్తుతం సోషల్ మీడియాలో కార్తీక్ సుబ్బరాజ్ పరిస్థితిని హీరో సూర్యతో లింక్ చేస్తూ కొందరు నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. సూర్యతో సినిమా అనౌన్స్ చేశాక కార్తీక్ సుబ్బరాజ్ గ్రాఫ్ తగ్గిందని, అలాగే కంగువ ఫ్లాప్ తర్వాత డైరెక్టర్ శివ కూడా కనిపించకుండా పోయారని సెటైర్లు వేస్తున్నారు. ఇక సూర్యతో పని చేసిన దర్శకులకు బ్యాడ్ టైం నడుస్తోందంటూ వస్తున్న కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. అయితే ఇవన్నీ కేవలం యాదృచ్ఛికమే అని, సూర్య ఫ్యాన్స్ గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. స్టోన్ బెంచ్ ఫిలిమ్స్ - ప్రొడక్షన్‌పై ఫోకస్: డైరెక్టర్‌గా ఎదురుదెబ్బలు తగిలినా, నిర్మాతగా మాత్రం కార్తీక్ సుబ్బరాజ్ తన జోరును తగ్గించడం లేదు. తన సొంత బ్యానర్ స్టోన్ బెంచ్ ఫిలిమ్స్ ద్వారా వైవిధ్యమైన చిన్న సినిమాలను, వెబ్ సిరీస్‌లను నిర్మిస్తూ కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తున్నారు. కేవలం కమర్షియల్ సినిమాలే కాకుండా, కంటెంట్ ఉన్న చిత్రాలకు తన మద్దతు ఇస్తూ ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ షిఫ్ట్ ఆయన కెరీర్‌కు ఏ మేరకు ప్లస్ అవుతుందో చూడాలి. రాకా కోసం ఇంకా ఎంత వెయిట్? కంబ్యాక్ ఇస్తారా?: ఎన్ని విమర్శలు ఉన్నప్పటికీ, కార్తీక్ సుబ్బరాజ్ ప్రతిభపై సినిమా ప్రియులకు ఇంకా నమ్మకం ఉంది. ఆయన తీసిన జిగర్తాండ, పేట వంటి చిత్రాలు ఆయన సత్తా ఏంటో నిరూపించాయి. ఇప్పుడు ఆయన తీసిన ఇండీ ఫిల్మ్ కనుక సక్సెస్ అయితే, మళ్ళీ స్టార్ హీరోలు ఆయన ఇంటి ముందు క్యూ కట్టడం ఖాయం. ఒక దర్శకుడికి ఫ్లాపులు సహజమే కానీ, సరైన కంటెంట్ పడితే మళ్ళీ ఫామ్‌లోకి రావడం పెద్ద కష్టమేమీ కాదు. కార్తీక్ సుబ్బరాజ్ తన మార్క్ స్టైల్‌తో మళ్ళీ అదిరిపోయే హిట్ కొట్టాలని కోరుకుందాం.

# ఆ హీరో కోసం సారా ఖుషీ కపూర్ పోటాపోటీ!



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆయన కెరీర్ లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 56వ చిత్రం సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈ సినిమాలో ధనుష్ సరసన నటించే కథానాయిక ఎంపిక విషయంలో చిత్ర బృందం కసరత్తులు మొదలు పెట్టింది. ధనుష్ సినిమాల్లో కథానాయిక పాత్రలకు మంచి ప్రాధాన్యత ఉంటుంది. నాలుగు పాటలకు..రొమాంటిక్ సన్నివేశాలకు నాయిక పరిమితం కాదు. హీరో రోల్ కు ధీటుగా నాయిక పాత్రను ధనుష్ కోరుకుంటాడు. ఈ నేపథ్యంలో నాయిక ఎంపిక విషయంలోనూ దర్శకులు అంతే జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ ప్రాజెక్టు ప్రారంభంలో కన్నడ భామ రుక్మిణీ వసంత్‌ను కథానాయికగా ఎంపిక చేయాలని చిత్ర యూనిట్ భావించింది. దాదాపు అమె ఎంట్రీ కూడా ఖరారైంది. అయితే అమ్మడి బిజీ షెడ్యూల్ కారణంగా ప్రాజెక్ట్ వదులుకుంటుంది. ఎంత ప్రయత్నించినా డేట్స్ సర్దుబాటు చేయలేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టు నుండి తప్పుకుందని సమాచారం. రుక్మిణి తప్పుకోవడంతో ఇప్పుడు ఆ స్థానం కోసం బాలీవుడ్ బ్యూటీ సారా అలీ ఖాన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలోనే దక్షిణాది సినిమాల్లో నటించాలని సారా తన మనసులోని మాటను బయటపెట్టింది. ధనుష్ వంటి జాతీయ అవార్డు గ్రహీత సరసన నటించడం తన కెరీర్‌కు ప్లస్ అవుతుందని ఆమె భావిస్తోంది. -ధురంధర్- సినిమాతో పాన్ ఇండియాలోనూ అమ్మడికి మంచి గుర్తింపు దక్కింది. తెలుగులో -యూఫోరియా- సినిమాతోనూ లాంచ్ అయింది. అయితే తమిళ్ లో మాత్రం ఇంకా లాంచ్ అవ్వలేదు. ఆ చాన్స్ ధనుష్ కల్పిస్తాదని అమ్మడు ఆశిస్తోంది. అయితే సారా అర్జున్ కు పోటీగా అతిలోక సుందరి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్ కూడా ఈ రేసులో వినిపిస్తోంది. -ది ఆర్చీస్- సినిమాతో వెండితెరకు పరిచయమైన ఖుషీ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు కోసం ప్రయత్నిస్తోంది. శ్రీదేవి వారసురాలిగా సౌత్ ఇండస్ట్రీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడానికి ధనుష్ సినిమా కంటే మెరుగైన ఆప్షన్ మరొకటి ఉండదని అమ్మడు భావిస్తోంది. దీంతో ఖుషీ కూడా ఈ పాత్రను దక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కోలీవుడ్ మీడియా కథనాలు వెడెక్కిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హీరోయిన్ ఎంపిక మేకర్స్ కు సవాల్ గా మారే ఛాన్స్ ఉంది. సారా అలీ ఖాన్ కు ఉన్న అనుభవం, ఖుషీ కపూర్ కు ఉన్న ఫ్రెష్ లుక్ మధ్య చిత్ర యూనిట్ తర్జనభర్జన తప్పదు. ప్రస్తుతానికి ఇద్దరు నటీమణులతో ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయని త్వరలోనే ఒకరిని ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ధనుష్ మార్కెట్ క్రేజ్ దృష్ట్యా సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. మరి సారా అలీ ఖాన్ తన అనుభవంతో ఈ ఛాన్స్ కొట్టేస్తుందా? లేక ఖుషీ కపూర్ అదృష్టంతో , మామ్ ఇమేజ్ తో చేజిక్కించుకుంటుందా? అన్నది చూడాలి. తమిళరసన్ పచ్చముత్తు ఈ చిత్రానికి దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.





# ఛాన్స్ ఇక చిరంజీవి చేతుల్లోనే!


తెలుగు చలన చిత్ర పరిశ్రమలో దశాబ్దాల క్రితం పోటాపోటీగా సినిమాలు చేసి బాక్సాఫీస్ వద్ద తమకంటూ ప్రత్యేక సామ్రా జ్యాన్ని నిర్మించుకున్న హీరోలు మెగాస్టార్ చిరంజీవి - యాంగ్రీ మ్యాన్ రాజశేఖర్. అయితే కాలక్రమంలో చిరంజీవి తన ఇమేజ్ ను మరింత రెట్టింపు చేసుకోగా..రాజశేఖర్ మాత్రం రేసులో వెనుకబడ్డారు. అయినా చాలా కాలం పాటు సోలోగానే పరిశ్రమలో కొనసాగారు. ఈ మధ్య కాలంలో కెరీర్ సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. హీరో పాత్రలను వదిలేసి క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా..ప్రతి నాయకుడిగా నటించడానికి రెడీ అయ్యారు. ఈ క్రమంలోనే మెగాస్టార్ చిరంజీవి చిత్రంలో అవకాశం వస్తే విలన్ గా నటించాలని ఉందని రాజశేఖర్ ఓపెన్ అయ్యారు. వాస్తవానికి వీరిద్దర్నీ ఒకే తెరపై చూడాలని అభిమానులు చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. చిరంజీవి సినిమాలో రాజశేఖర్ పోషించేది సమానమైన హీరో పాత్ర? మరో పాత్ర అన్నది పక్కనబెడితే? ఆ కాంబినేషన్ లో ఓ సినిమా వస్తే బాగుంటుని తెలుగు ప్రేక్షకులు ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు. కానీ ఆ కోరిక ఇంత వరకూ నెర వేరవేరలేదు. తాజాగా రాజశేఖర్ ప్రకటన అభిమానులందరిలో సంతోషాన్ని నింపింది. చిరంజీవి సినిమాలో సరైన ప్రాధాన్యత ఉన్న విలన్ పాత్ర దొరికితే నటించడానికి తాను సిద్ధమని మనసులో మాట బయటపెట్టారు. సాధారణంగా హీరోగా రాణించిన వారు విలన్ పాత్రలు చేయడానికి కొంత సంకోచిస్తుంటారు. కానీ ప్రస్తుత ట్రెండ్ మారింది. జగపతిబాబు, అరవింద్ స్వామి వంటి వారు విలన్లుగా మారి సెకండ్ ఇన్నింగ్స్‌లో దూసుకుపోతున్నారు. రాజశేఖర్ కూడా తన ఇమేజ్‌కు భిన్నంగా కొత్త తరహా పాత్రలు చేయాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా చిరంజీవి వంటి అగ్ర హీరో సినిమాలో శక్తివంతమైన ప్రతినాయకుడిగా కనిపిస్తే అది తన కెరీర్‌కు సరికొత్త మలుపు అవుతుందని ఆయన భావిస్తున్నారు. ఇక చిరంజీవి సెకండ్ ఇన్నింగ్స్‌లో వైవిధ్యమైన సినిమాలను ఎంచుకుంటున్నారు. ఆయన సినిమాలో విలన్ పాత్ర ఎంత బలంగా ఉంటే? హీరో ఎలివేషన్ అంత బాగా వస్తుందని దర్శకులు నమ్ము తుంటారు. ఇప్పటికే చిరంజీవి సినిమాల్లో ఇతర భాషల నటులు విలన్లుగా కనిపిస్తున్నారు. అయితే రాజశేఖర్ వంటి సీనియర్ హీరో ఆ పాత్ర పోషిస్తే వచ్చే ఇంపాక్ట్ , క్రేజ్ మామూలుగా ఉండదు. వీరిద్దరి మధ్య ఉండే కెమిస్ట్రీ పోటీ సినిమా స్థాయిని పెంచుతుందనడంలో సందేహం లేదు. అయితే ఆ బాధ్యత దర్శకులపైనే ఉంది. రాజశేఖర్ సిద్ధంగా ఉన్నా? ఆయన వ్యక్తిత్వానికి , నటనకు తగినట్లుగా పవర్‌ఫుల్ పాత్రను డిజైన్ చేయడం అంత ఈజీ కాదు. పేరు కోసం కాకుండా, కథలో విలన్ పాత్రకు సరైన ప్రాధాన్యత ఉంటేనే కాంబినేషన్ వర్కవుట్ అవుతుంది. మెగాస్టార్‌ను ఢీకొట్టే స్థాయిలో మొండితనం ఉన్న పాత్రను రాజశేఖర్ కోసం సృష్టిస్తే? అది వెండితెరపై ఒక అద్భుతం అవుతుంది. రాజశేఖర్ కు అవకాశం ఇవ్వడంలో చిరంజీవి ఎంత మాత్రం సంశయించరు.

# ఎన్టీఆర్ ప్రాజెక్ట్‌పై ఎందుకింత కన్ఫ్యూజన్?



మామూలుగా ఒక స్టార్ హీరో, టాప్ డైరెక్టర్‌తో సినిమా ఓకే చేస్తే.. షూటింగ్ ఎప్పుడు? కాస్టింగ్ ఎవరు? అనే విషయాల్లో ఫుల్ క్లారిటీ ఉంటుంది. కానీ ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ సినిమా విషయంలో మాత్రం అంతా రివర్స్‌లో జరుగుతోంది. ఏడాది గడిచినా అప్‌డేట్స్ లేకపోవడం, షూటింగ్ ఆలస్యం కావడం నందమూరి అభిమానులను టెన్షన్‌లో పడేస్తోంది. అసలు ఈ భారీ ప్రాజెక్ట్ చుట్టూ ఇంత కన్ఫ్యూజన్ ఎందుకు నెలకొంది? క్లారిటీ కరువైందా లేక ప్లానింగ్ తప్పిందా? పూర్తి వివరాలు మీకోసం. ప్లానింగ్ లేని స్టార్ ప్రాజెక్ట్?: సాధారణంగా ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరో సినిమా అంటే సెట్స్ మీదకు వెళ్లకముందే అన్ని వివరాలు పక్కాగా లాక్ అయిపోతాయి. కానీ ఈ సినిమా విషయంలో షూటింగ్ మొదలై ఏడాది అవుతున్నా, ఇంతవరకు ఎంత శాతం పూర్తయింది? అసలు షెడ్యూల్స్ ఎలా సాగుతున్నాయి? అనే దానిపై చిన్న క్లూ కూడా లేదు. ఒక పెద్ద సినిమా విషయంలో ఇంతటి సందిగ్ధత ఉండటం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఇక ఏ చిన్న విషయం కూడా సూటిగా సాగకపోవడం మేకర్స్ మధ్య సమన్వయ లోపాన్ని సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. కాస్టింగ్ చుట్టూ సస్పెన్స్ డ్రామా: సినిమా ప్రారంభమై చాలా కాలం అవుతున్నా, ఇప్పటికీ ఇతర భాషల నటుల చేరిక గురించి రకరకాల వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇలాంటి భారీ స్థాయి చిత్రానికి ఒక ఏడాది తర్వాత కూడా కీలక నటీనటులు ఎవరో తేలకపోవడం ఆశ్చర్యంగా ఉంది. కనీసం హీరోయిన్ లేదా విలన్ ఎవరనే దానిపై కూడా చిత్ర యూనిట్ నుంచి సరైన స్పందన లేదు. ఇక ప్రతిరోజూ ఏదో ఒక కొత్త పేరు వినిపించడం వల్ల ప్రేక్షకులు అసలు ఏది నిజమో తెలియక కన్ఫ్యూజ్ అవుతున్నారు. ప్రశాంత్ నీల్ లాంటి డైరెక్టర్ నుంచి ఈ స్థాయి జాప్యం ఎవరూ ఊహించలేదు. ప్రశాంత్ నీల్ - ఎన్టీఆర్ ఆశలు: ప్రశాంత్ నీల్ అంటేనే క్లారిటీకి మారుపేరు. ఆయన సినిమాల్లో ప్రతి ఫ్రేమ్ పక్కా ప్లానింగ్‌తో ఉంటుంది. ఎన్టీఆర్ కూడా ఆయన విజన్ నమ్మి ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే పరిస్థితులు అనుకున్నట్లుగా సాగడం లేదని అర్థమవుతోంది. షూటింగ్ లేట్ అవ్వడం వల్ల అటు హీరో కాల్ షీట్స్, ఇటు నిర్మాతలకు నిర్మాణ వ్యయం పెరిగిపోయే ప్రమాదం ఉంది. అయినప్పటికీ ప్రశాంత్ నీల్ ప్రతిభపై అందరికీ నమ్మకం ఉండటమే ఈ ప్రాజెక్ట్‌కు ఉన్న పెద్ద ప్లస్ పాయింట్. ఫ్యాన్స్ ఆశ అంతా నీల్ పైనే: ఎన్ని ఇబ్బందులు ఉన్నా, ఎన్ని జాప్యాలు జరిగినా.. ప్రశాంత్ నీల్ వెండితెరపై మ్యాజిక్ చేయగలరని అభిమానులు బలంగా నమ్ముతున్నారు. ఎన్టీఆర్‌కు ఆయన కెరీర్‌లోనే ఒక గుర్తుండిపోయే మాస్ హిట్ ఇస్తారనే ఆశతోనే వెయిట్ చేస్తున్నారు. ఇక ప్రొడక్షన్ ఖర్చులు పెరిగినా, చివరికి అవుట్‌పుట్ అదిరిపోతే అన్నీ మర్చిపోవచ్చు. అయితే ఇకనైనా టీమ్ నుంచి ఒక అధికారిక క్లారిటీ వస్తే బాగుంటుందనేది నందమూరి అభిమానుల మాట. మరి ప్రశాంత్ నీల్ ఎప్పుడు ఈ కన్ఫ్యూజన్‌కు చెక్ పెడతారో చూడాలి!

# బన్నీ ఫ్యాన్స్‌కు టెస్ట్ టైమ్.. రాకా కోసం ఇంకా ఎంత వెయిట్?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ రాకా చుట్టూ తాజా బజ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. మొదట 2027 ఏప్రిల్‌లో రిలీజ్ కావాల్సిన ఈ సినిమా, ఇప్పుడు ఆ టైమ్‌లైన్‌ను మిస్ అయ్యే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా రిలీజ్ డిసెంబర్ 2027 లేదా సంక్రాంతి 2028కు షిఫ్ట్ అయ్యే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తోంది. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై రిలీజ్ వాయిదా వార్తలు ఫ్యాన్స్‌లో ఆసక్తితో పాటు కొంత ఆందోళనను కూడా పెంచుతున్నాయి. 2027 ఏప్రిల్ వరకు రాకా షెడ్యూల్స్ ఈ ఊహాగానాలకు కారణంగా మారింది ముంబై షూటింగ్ నుంచి బయటకు వచ్చిన ఓ చిన్న క్లూ. చిత్ర యూనిట్ ఉపయోగిస్తున్న ఐడెంటిటీ ట్యాగ్‌పై ఉన్న వివరాల ప్రకారం, షూటింగ్ షెడ్యూల్ ఏప్రిల్ 2027 వరకూ కొనసాగవచ్చని సంకేతాలు కనిపించాయి. సాధారణంగా పెద్ద సినిమాలకు లాంగ్ షెడ్యూల్స్ ఉండటం కొత్త విషయం కాదు. కానీ రాకా విషయంలో ఈ స్థాయి లాంగ్ షూటింగ్ ఎందుకు అవసరమైంది అన్న ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. డైరెక్టర్ అట్లీ తన స్టైల్‌కు తగ్గట్టుగా ప్రతి సీన్‌ను గ్రాండియర్‌గా ప్లాన్ చేస్తున్నారనే టాక్ ఉంది. రాకా హాలీవుడ్ టెక్నీషియన్స్ కూడా ఇక ఈ ఆలస్యానికి మరో కీలక కారణంగా చెప్పబడుతున్నది భారీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్. ఈ సినిమా కోసం హాలీవుడ్‌కు చెందిన పలువురు టెక్నీషియన్స్ కూడా వర్క్ చేస్తున్నారు. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టిన ఈ సినిమా, పోస్ట్ ప్రొడక్షన్‌కే ఎనిమిది నెలల కంటే ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉందని ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. ఇదే నిజమైతే, రాకా విజువల్ పరంగా కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. సూర్యకు దెబ్బ తప్పదా? ఫ్యాన్స్ మిక్స్డ్ రియాక్షన్స్ అయితే ఈ భారీ స్కేల్ ఒకవైపు హైప్‌ను పెంచుతుండగా, మరోవైపు వెయిటింగ్ టైమ్ కూడా పెరుగుతోంది. కాగా ఈ విషయంలో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ రియాక్షన్ మిక్స్డ్‌గా ఉంది. మంచి క్వాలిటీ కోసం ఎంతైనా వెయిట్ చేస్తామని ఓ వర్గం చెబుతుండగా, ఇంకా ఎంత కాలం వెయిట్ చేయాలంటూ మరొక వర్గం ప్రశ్నిస్తోంది. అల్లు అర్జున్ ఫ్యాన్‌బేస్‌లో మాత్రం ఈ ప్రాజెక్ట్‌పై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతూనే ఉంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న రాకా గ్లోబల్ మార్కెట్‌ను టార్గెట్ చేస్తోందని స్పష్టమవుతోంది. అందుకే మేకర్స్ రిలీజ్ టైమింగ్ విషయంలో కూడా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. సంక్రాంతి 2028 సీజన్‌ను టార్గెట్ చేస్తే, భారీ బాక్సాఫీస్ రన్ సాధించే అవకాశం ఉంటుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో, ఇతర స్టార్ సినిమాలతో క్లాష్ ఎలా ఉంటుందన్నది కూడా ఆసక్తికర అంశంగా మారింది. మొత్తానికి, భారీ అంచనాలు, విస్తృతమైన నిర్మాణ ప్రక్రియ, హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వర్క్ అన్నీ కలిపి రాకాను ఒక లాంగ్ గెస్టేషన్ ప్రాజెక్ట్‌గా మార్చుతున్నాయి.